సాక్షి అనంతపురం

శనివారం । 29 । జూన్ । 2024



భారీగా తగ్గిన చీనీ ధర

చీనీ ధర రోజురోజుకూ పడిపోతోంది. శుక్రవారం అనంతపురం మార్కెట్‌యార్డులో టన్ను గరిష్టంగా రూ.18 వేలు పలికింది.



రీ సర్వే భూములకు రిజిస్ట్రేషన్

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని వ్యవసాయ భూములకు జూలైలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/23.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కోటంక హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అనంతపురం డివిజన్ తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ సమక్షంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.1,12,179 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు, వెంకటేషులు, ఎర్రిస్వామి, జయరాముడు, సత్యనారాయణరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు ఎంపిక జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతుల సీట్ల భర్తీకి ఎంపిక జాబితా సిద్ధమైంది. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 63 సీట్లకు మొత్తం 1,301 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 957 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాలను మెరిట్ జాబితా ప్రకారం అన్ని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. ఎంపికైన విద్యార్థులకు సంబంధించి బాలురకు నార్పల బీసీ గురుకుల పాఠశాలలో జూలై 2న, బాలికలకు 3న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కౌన్సెలింగ్ జోనల్ ఆఫీసర్ రాజేంద్రనాథకుమార్‌రెడ్డి, కన్వీనర్ సంగీతకుమారి ఓ ప్రకటనలో తెలియజేశారు. 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఆయా మెరిట్ విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేస్తామని వెల్లడించారు.


రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సాయం



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్

అనంతపురం: జిల్లా జైలులోని రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వం తరఫున ఉచితంగా న్యాయ సాయం అందజేస్తామని జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ అన్నారు. జిల్లా జైలులో శుక్రవారం ఆయన పర్యటించి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, వసతి, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. నిరుపేద రిమాండ్ ఖైదీలకు పూర్తి ఉచితంగా ప్రభుత్వమే న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందన్నారు. జైలు పర్యవేక్షకులు రెహమాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్రకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో నీరు అడుగంటింది. కొద్ది రోజుల క్రితం ఇన్‌ఫ్లో కాస్త పెరిగి నీటి నిల్వ 6 టీఎంసీలు దాటింది. ఈ స్థితిలో ఎగువ భాగంలో వర్షాలు నిరాశాజనకంగా ఉండడంతో నీటి నిల్వ 5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో జలాశయం కళ తప్పింది.

నత్తనడకన సమాయత్తం

- 'సాగుకు సమాయత్తం'పై చిన్న చూపు
- రైతుల సమీకరణలో నిర్లక్ష్యం
- 50 మందితోనే మండలస్థాయి కార్యక్రమం నిర్వహణ



ఏ.నారాయణపురం కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేసే కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ సీరియస్‌గా తీసుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏదో చేశామంటే చేశామన్నట్లుగా మండలానికి ఒక చోట చిన్నపాటి కార్యక్రమంతో ముగించేస్తున్నారు. మండలస్థాయి కార్యక్రమానికి కనీసం 50 మంది రైతులను కూడా సమీకరించడం లేదు. రెండు మూడు మండలాలు మినహా మిగతా ప్రాంతాల్లో 20 నుంచి 30 మందితో పూర్తి చేసి గ్రామస్థాయికి పరిమితం చేస్తున్నారు. మినిట్స్‌లో మాత్రం 50 మంది వరకు చూపిస్తున్నారు. ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపు లేని కారణంగా అంతో ఇంతో ఖర్చు భరించడానికి ఆసక్తి చూపించకపోవడంతో కంటితుడుపుగా కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

మండలానికి ఒకటి చొప్పున షెడ్యూల్

ఈ సీజన్‌లో మండలానికి ఒక ఆర్‌బీకే లేదా మండల కేంద్రంలో ఉన్న ఏఓ కార్యాలయం లేదా ఆర్‌బీకేలో 'సాగుకు సమాయత్తం' కార్యక్రమం నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఆయా ప్రాంతాలు, భూములను బట్టి రైతులు ఏ పంట వేసుకుంటే మేలు.. అంతర పంటలు, ఎర పంటలు, మేరసాళ్ల ప్రయోజనాలు, పంట మార్పిడి, విత్తన రకాలు, వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న లాంటి ప్రధాన పంటలతో పాటు చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగు ప్రాధాన్యత, విత్తన శుద్ధి, కలుపు సమస్య, నివారణ, సీజనల్ వారీగా, పంటల వారీగా చీడపీడలు, సస్యరక్షణ తదితర సలహాలు, సిఫారసులపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రాయితీ విత్తనాలు, బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాలు, ఎరువులు, పంటల వారీగా ఎంఎస్‌పీ, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించి ఖరీఫ్ సాగుపై దృష్టి సారించేలా చేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ చేపట్టాల్సి ఉంది. ఇందులో వ్యవసాయశాఖకు చెందిన జేడీఏ స్థాయి నుంచి డీడీఏ, ఏడీఏ, ఏఓ, ఏఈఓ, ఆర్‌బీకే అసిస్టెంట్లతో పాటు ఎంపీఈఓలు భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది. అలాగే జిల్లా వనరుల కేంద్రం (డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్), రైతు శిక్షణ కేంద్రం (ఫార్మర్ ట్రెనింగ్ సెంటర్-ఎఫ్‌టీసీ) బృందం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధంగా జిల్లా పరిధిలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రాలు (ఏఆర్‌ఎస్), కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే), ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్)కు చెందిన శాస్త్రవేత్తలను భాగస్వాములను చేసి వారి అనుభవాలు, నూతన పంట విధానాలు, యాంత్రీకరణ తదితర అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించాలి.

ఒకట్రెండు గ్రామాలకే పరిమితం

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'సాగుకు సమాయత్తం' కార్యక్రమానికి అధికారులు, శాస్త్రవేత్తల హాజరు శాతం బాగానే ఉన్నా... మండల పరిధిలో ఉన్న ప్రతి గ్రామం నుంచి కనీసం ఐదారుగురు రైతులను సమీకరించడంలో విఫలమైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దగ్గరున్న రెండు మూడు గ్రామాల నుంచి కొందరు రైతులతో కానిచ్చేస్తున్నారు. కనీసం మండలంలో ఐదారు ఆర్‌బీకేల్లోనైనా ఇలాంటి కార్యక్రమాలు చేపడితే కొంత వరకు రైతులకు ప్రయోజనం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జేడీఏ ఉమామహేశ్వరమ్మను వివరణ కోరగా... 50 మంది రైతులకు తక్కువగా కాకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామం నుంచి హాజరయ్యేలా చూసే బాధ్యత జిల్లా వనరుల కేంద్రం, సంబంధిత డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులదేనని తెలిపారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పిలుపు

అనంతపురం టౌన్: మొక్కల పెంపకం ఉద్యమంలా చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం డ్వామా అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 100 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్జీఓలు, గ్రామ పంచాయతీల పాలకవర్గంతో సమన్వయం చేసుకొని అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ప్రతి మండలంలోనూ నాలుగు కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వీటితోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలను సైతం స్థానిక విద్యార్థులకు కేటాయించే విధంగా పాఠశాల కమిటీలతో కలిసి పని చేయాలన్నారు. కొండ గుట్టలో పచ్చదనం పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న బోడి కొండలను గుర్తించాలన్నారు. ప్రతి కొండలోనూ కందకాలు తవ్వి వాటిలో సీడ్ బాల్స్ వేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలోగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ

అనంతపురం క్రైం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ జూలై ఒకటో తేదీన చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. జిల్లాలో 2,89,508 మంది పింఛన్‌దారులకు పెంచిన మొత్తంతో కలిపి రూ.197.44 కోట్లు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో గత మూడు నెలల పెంచిన మొత్తం రూ.70.62 కోట్ల బకాయిలతో పాటు జూలై నెలకు సంబంధించిన రూ.126.81 కోట్లు పింఛన్ అర్హులకు అందజేస్తారని తెలిపారు. ఉదయం 6 గంటలకే ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని పీడీ స్పష్టం చేశారు.

పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు



అధికారులతో కలిసి పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



పరిశ్రమలు, ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరైన అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే అభివృద్ధి, అదే స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల స్థాపన దిశగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమల శాఖ అధికారి జి.నాగరాజారావుతో కలిసి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి సాధించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. సింగిల్‌విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నిర్దిష్ట సమయంలో ఆమోదించాలని ఆదేశించారు. అనుమతుల జారీ వేగంతం చేయడానికి, పారదర్శకత పెంచేందుకు సలహాలు, సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని పరిశ్రమల సంఘం ప్రతినిధులకు సూచించారు. ఇండస్ట్రియల్ పార్క్, గుత్తిలో స్థాపించిన నందిని ఫుడ్స్, సప్రీం సిమెంట్ ఫ్లయాష్ బ్రిక్స్, రాప్తాడు పార్కులో స్థాపించిన సప్తగిరి గ్రానైట్ ఇండస్ట్రీలకు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఇచ్చేందుకు ఏపీఐఐసీకి అనుమతి ఇచ్చారు. ఇక ఇండస్ట్రియల్ పాలసీ కింద 16 యూనిట్లకు రూ.1.8కోట్ల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది.

రక్తం అందుబాటులో ఉండాలి

రక్తనిధి కేంద్రాల్లో అన్ని గ్రూపుల రక్తం అందుబాటులో తప్పక ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. రెడ్ క్రాస్ కార్యక్రమాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతితో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి వారం రక్తదాన శిబిరం నిర్వహించి 100 యూనిట్ల రక్తం సేకరించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ల్లో అన్ని సదుపాయాలూ ఉండేలా చూడాలన్నారు. వైద్యశాలలో సిబ్బంది తప్పనిసరిగా బీఎల్ఎస్ బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై సర్టిఫికెట్ ట్రెనింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ ద్వారా ఐ బ్యాంక్ స్థాపనకు కృషి చేయాలని సూచించారు. సంస్థకు దాతలు విరివిగా విరాళాలు ఇచ్చి రెడ్ క్రాస్ అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేనూ సభ్యునిగా చేరుతా

తాను రెడ్‌క్రాస్ జీవిత సభ్యునిగా చేరుతానని కలెక్టర్ ప్రకటించారు. యువత కూడా రెడ్ క్రాస్ సభ్యులుగా చేరి సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సేవకులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోల్ అథారిటీ రమేష్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై నిఘా

మత్తు పదార్థాలు వినియోగించకుండా నిఘా ఉంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి సాగు, రవాణా జరగకుండా చూడాలన్నారు. యువత వాటిని ఉపయోగించకుండా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గత ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు కెనాబీస్, ఆల్కహాల్, గంజాయి కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి వస్తున్న, అనంతపురం నుంచి బళ్లారి వెళుతున్న ప్రైవేటు బస్సులను తనిఖీ చేయాలని చెప్పారు. జిల్లా సరిహద్దులో, మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగవుతోందా అనే దానిపై తనిఖీ చేయాలన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, బార్లలో మత్తపదార్థాలు ఉపయోగించకుండా అవగాహన పోస్టర్లు ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం నిశాముక్త్ భారత్‌లో భాగంగా ఎన్‌హెచ్‌ఎంఐఈసీ కార్యకలాపాల కింద 'సే నో టూ డ్రగ్స్' పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఆర్డీఓ వెంకటేష్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని చెప్పారు. బ్లాక్ స్పాట్ల వద్ద అప్రమత్తతను గుర్తు చేసేలా సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతపురం నగర పరిధిలో 40 సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పారు. వాటిని పోలీసు, జిల్లా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, డీఎస్పీ ఆంథోనప్ప, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన సర్వజనాస్పత్రి



సర్వజనాస్పత్రిలో రోగులతో నిండిన ఒక వార్డు

- సీజనల్ వ్యాధులతో రోగుల క్యూ
- అధికమవుతున్న డయేరియా కేసులు

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి రోగులతో కిక్కిరిసిపోతోంది. రోడ్డు ప్రమాదాలతో పాటు వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారు చికిత్స కోసం ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. సగటున రోజుకు ఓపీ 1,800, అడ్మిషన్ (ఐపీ) 1,107 ఉంటోంది. ఇటీవల డయేరియా (అతిసారం) కేసులు అధికమయ్యాయి. ఈఎన్‌టీ, మేల్ మెడిసిన్ (ఎంఎం), ఫీమేల్ మెడిసిన్ (ఎఫ్ఎం), చిన్నపిల్లలు, తదితర వార్డులు రోగులతో నిండిపోయాయి. ప్రధానంగా డయేరియా కేసులపై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టిసారించారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.భీమసేన ఆచార్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసులు, నెఫ్రాలజిస్టు డాక్టర్ హరీష్‌లతో ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయేరియా వార్డు, చిన్నపిల్లల వార్డు, ఎంఎం, ఎఫ్ఎం వార్డులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 63 డయేరియా కేసులున్నాయి. జిల్లాలోని అనంతపురం అర్బన్, రాప్తాడు, కూడేరు, ధర్మవరం, పుట్టపర్తి, పామిడి, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో డయేరియా కేసులు నమోదవుతున్నాయి.

ఓఆర్ఎస్ కార్నర్

చిన్నపిల్లల వార్డులో డయేరియాతో బాధపడే చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. అందులోనే ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎంత మోతాదులో చిన్నారులకు అందించాలి.. తదితర విషయాలపై తల్లులకు స్టాఫ్‌నర్సులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం చిన్నపిల్లల వార్డులో 16 డయేరియా కేసులున్నాయి.



చిన్నపిల్లల వార్డులో చికిత్సనందిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్



ఓఆర్ఎస్ సెంటర్‌లో తల్లులకు అవగాహన కల్పిస్తున్న స్టాఫ్‌నర్సు

వాహనాల అద్దె బిల్లు కోసం ఆందోళన

అనంతపురం సెంట్రల్: ఎన్నికల సమయంలో ఆర్టీఓ అధికారులకు వాహనాలు అద్దెకు ఇచ్చి నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఓ ట్రావెల్స్ యజమాని ఆందోళనకు దిగారు. శుక్రవారం మధ్యాహ్నం డీటీసీ కార్యాలయం గేటు ఎదురుగా ఎంవీఐ కారుకు తన వాహనాలు అడ్డుపెట్టి ధర్నాకు దిగారు. బిల్లులు చెల్లించకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు... అనంతపురం నగరానికి చెందిన సూరి ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. అతనికి సంబంధించిన రెండు కార్లను ఎన్నికల సమయంలో ఆర్టీఓ అధికారులు అద్దెకు తీసుకున్నారు. అయితే వీటికి సంబంధించిన అద్దె బిల్లులు ఇప్పటికీ మంజూరు కాలేదు. దీంతో సూరి శుక్రవారం ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మధ్యాహ్న సమయంలో ఎంవీఐ శ్రీనివాసులు ఇంటికి వెళుతుండగా.. ఆయన కారుకు తన రెండుకార్లు అడ్డుపెట్టి నిరసనకు దిగారు. 'మీరు చెబితే నేను వాహనాలు అద్దెకు ఇచ్చాను. కనీసం డ్రైవర్ బత్తా కూడా ఇవ్వలేదు. నెలలు గడుస్తున్నా అద్దె ఇవ్వకపోతే మేం ఎలా జీవించాలి.. 25 రోజులకుపైగా వాహనాలను అద్దెకు తీసుకున్నారు. అద్దె డబ్బులు ఇచ్చేంతవరకు ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదు. ఇవ్వకపోతే పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాం' అని సూరి హెచ్చరించారు. వెంటనే స్పందించిన ఆర్టీఓ అధికారులు సూరిని సముదాయించారు. అతన్ని వెంటబెట్టుకుని కలెక్టరేట్‌కు వెళ్లారు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యేలా చేస్తామని ఉన్నతాధికారులతో హామీ ఇప్పించారు. సూరికి రూ.38 వేలు చెల్లించాల్సి ఉందని, త్వరలోనే చెల్లిస్తామని డీటీసీ వీర్రాజు 'సాక్షి'కి తెలిపారు.



ఆందోళన నిర్వహిస్తున్న వాహన యజమాని సూరి

కాగా, అనంతపురం జిల్లాలో ఎన్నికల సమయంలో సుమారు 1,400 వాహనాలను ఆర్టీఓ అధికారుల ద్వారా అద్దెకు తీసుకున్నారని, వాటికి సంబంధించి రూ.2.5కోట్లు బకాయి ఉన్నట్లు తెలిసింది.

ఎస్కేయూ వీసీ రాజీనామా



ప్రొఫెసర్ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి అధికారికంగా సమాచారం పంపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఇది వరకు పనిచేస్తున్న వీసీలు, రిజిస్ట్రార్లు రాజీనామా చేయాలని అధికారికంగా కోరడంతో ఎస్కేయూ వీసీ అనివార్యంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయమే వీసీ బంగ్లా నుంచి వెళ్లిపోయిన ఆయన.. అనంతపురంలో తన నివాసం నుంచి రాజీనామా లేఖను యూనివర్సిటీకి, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి పంపారు.

- హుస్సేన్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 17న ఎస్కేయూ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. కెమిస్ట్రీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. బోధన, పరిశోధన రంగాల్లో నిష్ణాతుడు. ఎస్కేయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీ కార్యకర్తల ఒత్తిళ్ల మేరకు తొలగించి అప్రతిష్ట మూట గట్టుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తే మీ పదవికి ధోకా లేదని చెప్పి, పని పూర్తయ్యాక ఆయన్ను పదవీచ్యుతుడ్ని చేశారు.

క్లుప్తంగా

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కేతన్‌గార్గ్



జేసీ కేతన్‌గార్గ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గత ప్రభుత్వం నియమించిన పాలక వర్గం గడువు ముగియడంతో కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యే వరకూ ఆయనను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో డీసీసీబీ సీఈఓ సురేఖా రాణి, సిబ్బంది కలెక్టరేట్‌లో జేసీ కేతన్‌గార్గ్‌ను కలిసారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం జేసీ బ్యాంకు అందిస్తున్న సేవలు, వ్యాపార లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు.

ఆదాయం జాస్తి.. సౌకర్యాలు నాస్తి

- తాడిపత్రి రైల్వే స్టేషన్ పరిస్థితి ఇది
- నెలకు రూ.60 కోట్లకు పైగా ఆదాయం
- అయినా తాడిపత్రిలో ఆగని పలు రైళ్లు
- రైల్వే జీఎం, డీఆర్ఎం, ఎంపీకు వినతులు ఇచ్చిన ప్రయోజనం శూన్యం
- తక్కువ రైళ్ల స్టాపింగ్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- కిక్కిరిసిపోతున్న జనరల్ బోగీలు



తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌కు రూ.కోట్లలో ఆదాయం ఉన్నా... అందుకు అనుగుణంగా సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ మీదుగా రోజూ 26 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో కేవలం 16 రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. మిగిలిన రైళ్లు నాన్‌స్టాప్‌గా దూసుకెళుతుంటాయి. వాటికి స్టాపింగ్ ఇవ్వాలని పలుమార్లు తాడిపత్రి రైల్వేస్టేషన్ తనిఖీకి వచ్చిన రైల్వే జీఎం, గుంతకల్లు డీఆర్ఎంకు వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది. గతంలో ఎంపీగా గెలిచిన జేసీ దివాకర్‌రెడ్డి దృష్టికి సైతం ఇదే అంశాన్ని స్థానికులు తీసుకెళ్లారు. పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఇచ్చిన హామీ చివరకు బుట్టదాఖలైంది. ఆయన పదవీ కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలసి తాడిపత్రి ప్రజల అభీష్టాన్ని తెలిపిందీ లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా టీడీపీ ఎంపీలు ఉండడంతో ఈసారి అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానిక వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు కోరనున్నట్లు సమాచారం..

ఆదాయంలో అగ్రగామి

తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి నెలకు రూ.60 కోట్లకు పైగా ఆదాయాన్ని ఆ శాఖ గడిస్తోంది. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో అల్ట్రాటెక్, పెన్నా, సాగర్ తదితర భారీ సిమెంట్ పరిశ్రమలతో పాటు స్టీల్ ప్లాంట్ ఉంది. ఆయా పరిశ్రమలకు తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేకంగా ట్రాక్ వేశారు. రోజూ గూడ్స్ వ్యాగన్ల ద్వారా సిమెంట్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకూ సరఫరా అవుతోంది. ఈ క్రమంలోనే ఆయా సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన బొగ్గుతో పాటు ఇతర ముడి సరుకునూ ఇతర ప్రాంతాల నుంచి గూడ్స్ రైళ్ల ద్వారా తీసుకువస్తుంటారు. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఐరన్ ఓర్, ఇతర ముడి సరుకు రవాణా నిత్యమూ జరుగుతోంది. ప్లాంట్‌లో తయారైన ఐరన్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈ మొత్తం లావాదేవీల్లో రైల్వే శాఖకు రూ.కోట్లలోఆదాయం ఉంటోంది. అల్ట్రాటెక్ ద్వారా నెలకు రూ.32కోట్లు, స్టీల్ ప్లాంట్ నుంచి రూ.30 కోట్లు ఆదాయం ఉంటోంది. పెన్నా సిమెంట్స్ నుంచి రూ.4 కోట్ల ఆదాయం ఉండేది. అనివార్య కారణాల వల్ల కొంత కాలంగా పెన్నా ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ రవాణా నిలిచిపోయింది.

టికెట్ల విక్రయంతో నెలకు రూ.60 లక్షలు

తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి రిజర్వేషన్ టికెట్లు, రోజు వారీ టికెట్ల విక్రయాల ద్వారా నెలకు రూ.60లక్షల ఆదాయం ఉంటోంది. ఈ లెక్కన రోజూ సగటున రూ.2 లక్షలకు ఆదాయం తగ్గకుండా ఉంటోంది. స్టాపింగ్ లేని రైళ్లను ఇక్కడ ఆపడం ద్వారా మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. తద్వారా ప్రయాణికుల ఇక్కట్లూ దూరమవుతాయి. స్టాపింగ్ రైళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు టికెట్ల రిజర్వేషన్‌లో వెయిటింగ్ లిస్ట్ ఎక్కువగా ఉంటోంది. దీంతో వారు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటున్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా లేని రైళ్లు

తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారి సంఖ్యకు అనుగుణంగా రైళ్ల సంఖ్య లేదు. ప్రస్తుతం తాడిపత్రిలో స్టాపింగ్ ఉన్న రైళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై- ముంబయి ప్రధాన మార్గంలో తాడిపత్రి రైల్వే స్టేషన్ ఉండడంతో రైళ్లు కిక్కిరిసిన ప్రయాణికులతో వెళుతున్నాయి. తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు ఈ మార్గం గుండా వెళ్లే రైళ్లల్లో ప్రయాణం చేస్తుంటారు. వారితోనే రైళ్లు నిండిపోతుంటాయి. ఇక సామాన్య ప్రయాణికుల పరిస్థితి వర్ణనాతీతం. తాడిపత్రి ప్రాంతంలో విస్తరించిన భారీ, చిన్న తరహా పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు, కూలీలు వస్తున్నారు. ఈ క్రమంలోనే వివిధ రకాల వ్యాపారాల నిమిత్తం వచ్చిపోయే ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల సంఖ్య కూడా భారీగానే ఉంటోంది. బతుకు తెరువు కోసం వస్తున్న వారిలో అత్యధికులు నిరుపేదలే కావడంతో వారు జనరల్ బోగీలనే ఆశ్రయిస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో జనరల్ బోగీలు కిక్కిరిసిపోతుండడంతో తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కే ప్రయాణికుల పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది.

తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ లేని 13 రైళ్లు

రైలు నంబర్	నుంచి	వరకు	టైమింగ్	ఏ రోజు
20919	చెన్నై సెంట్రల్	ఏక్తానగర్	04.50	సోమవారం
22102	మధురై	లోకమాన్యతిలక్	04.50	శనివారం
17314	చెన్నై	హుబ్లీ	21.55	గురు- శని
22180	చెన్నై	ముంబయి	22.00	మంగళవారం
12790	మంగళూరు	కాచిగూడ	15.30	ఆది- గురు
22705	తిరుపతి	జమ్ముతావి	00.50	బుధవారం
22919	చెన్నై	అహ్మదాబాద్	22.10	బుధవారం
22706	జమ్ముతావి	తిరుపతి	02.10	మంగళవారం
22179	లోకమాన్యతిలక్	చెన్నై	04.00	మంగళవారం
22101	లోకమాన్యతిలక్	మధురై	04.00	గురువారం
17313	హుబ్లీ	చెన్నై	04.30	గురు- శని
16733	రామేశ్వరం	ఓఖా	15.40	గురువారం
16734	ఓఖా	రామేశ్వరం	01.45	మంగళవారం

తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో సింగిల్ సైడ్ స్టాపింగ్ రైళ్లు

రైలు నంబర్	నుంచి	వరకు	టైమింగ్	ఏ రోజు
16352	నాగర్‌కోయిల్	ముంబయి	02.20	సోమ-శుక్ర
20953	చెన్నై	అహ్మదాబాద్	22.00	శుక్రవారం
17622	తిరుపతి	ఔరంగబాద్	06.40	మంగళవారం

ఎరికలయ్య కుటుంబానికి అండగా ఉంటాం



ఎరికలయ్య మృతదేహానికి పూలమాలలు వేస్తున్న పైలా నరసింహయ్య, ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు

పుట్లూరు: ఎన్నికల సమయంలో టీడీపీ నేతల రాళ్ల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎరికలయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం సాయంత్రం పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి బెంగళూరు నుంచి ఎరికలయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వారు ఆ గ్రామానికి చేరుకుని ఎరికలయ్య మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అంత్యక్రియల అనంతరం పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు చేస్తున్న దాడులు పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పార్టీలు అధికారంలోకి రావడం, పోవడం సహజమన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా దాడులను ప్రోత్సహించడం అనాగరిక చర్య అన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మద్దతుదారులపై టీడీపీ నాయకులు సాగిస్తున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాఘవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సునామజకినీ మాత' పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

గుత్తి: స్థానిక ఆర్ఎస్ రోడ్డులో వెలసిన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామజకినీ మాత ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఎం.ఎ.లక్ష్మణ్‌రావు, ధర్మకర్తగా కె.సురేష్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.కె.సాయినాథరావు, ప్రధాన కార్యదర్శిగా డి.భాస్కరరావు, కోశాధికారిగా హెచ్.సుధాకర్‌రావు, సహ కోశాధికారిగా ఎంకే బాబూరావు, మహిళా విభాగం ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా ఎ.సరస్వతిబాయి ఎంపికైన విషయం తెలిసిందే. వీరు శుక్రవారం ఉదయం ఆలయంలో విశేష పూజల అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

నాయకత్వ లక్షణాలతో ఉన్నత స్థాయికి ఎదగాలి



క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కల్నల్ కులకర్ణి

కూడేరు: ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న క్రమశిక్షణ, సేవాగుణాన్ని అలవర్చుకుని నాయకత్వ లక్షణాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ కులకర్ణి పిలుపునిచ్చారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజులుగా సాగుతున్న సీఏటీసీ-1 6 ఆంధ్రా బెటాలియన్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమాండర్ మాట్లాడారు. క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామాల భూములకు రిజిస్ట్రేషన్

అనంతపురం టౌన్: గ్రామాల్లో రీ సర్వే చేసిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గత మూడు నెలలుగా ఆగిపోయింది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని వ్యవసాయ భూములకు సర్వే నంబర్‌తో పాటు ఎల్‌పీ నంబర్‌ను కొత్తగా కేటాయించారు. ఈ క్రమంలో ఎల్‌పీ నంబర్లతో రిజిస్ట్రేషన్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన నూతన సాఫ్ట్‌వేర్ (కార్డ్ ప్రైమ్ 2.0) అనుసంధానం కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో గ్రామాల్లోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో భూముల క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు నెలలకు పైగా కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రధానంగా కురుగుంట, రాచానపల్లి, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి, రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున వెంచర్లు వెలిశాయి. ఈ గ్రామాల్లోని భూముల ఎల్‌పీ నంబర్ల వివరాలు సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడింది. ఈ సమస్యను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్లు తీసుకెళ్లారు. దీంతో నూతన సాఫ్ట్‌వేర్‌కు రీ సర్వే గ్రామాల భూముల ఎల్‌పీ నంబర్ల వివరాలను అనుసంధానం చేసే ప్రక్రియపై దృష్టి సారించారు. మరో రెండు మూడు రోజుల్లో అనుసంధాన ప్రక్రియ పూర్తి కానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే జూలై మొదటి వారంలో రీ సర్వే చేపట్టిన గ్రామాల్లోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులు, అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.సత్యవాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. అన్ని రకాల కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాదభరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ టాక్స్ కేసులు, మునిసిపల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులు అందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆచార్య శశిధర్, మమత

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) నూతన ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వర్సిటీ పురోగతికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం జూలై ఒకటో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు డీఈఓ బి.వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రీకౌంటింగ్ కోసం రూ.500, రీవెరిఫికేషన్ ద్వారా జవాబుపత్రం నకలుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నేరుగా డీఈఓ కార్యాలయంలో కానీ, బోర్డులో కానీ స్వీకరించబడవని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూడేరు: ధర్మవరానికి చెందిన అనిల్ అనే యువకుడు శుక్రవారం కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడిలో ఓ శుభకార్యాన్ని చూసుకుని ధర్మవరానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన అనిల్...జల్లిపల్లి వద్దకు చేరుకోగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంటలకు తాళలేక గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు గమనించి కాపాడారు. 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గూడ్స్ రైలు చక్రాలకు చుట్టుకున్న టార్పాలిన్



టార్పాలిన్ పట్టాను తొలగిస్తున్న సిబ్బంది

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా లోడ్‌తో వెళుతున్న గూడ్స్ రైలుకు శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వ్యాగన్‌లపై కప్పిన టార్పాలిన్ పట్టా గాలికి ఎగిరి కొంత భాగం చక్రాలకు చుట్టుకుంది. విషయాన్ని గుర్తించిన లోకో పైలెట్ వెంటనే గూడ్స్‌ను స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాంపై ఆపేశారు. అనంతరం రైల్వే సిబ్బంది సహకారంతో వ్యాగన్‌లపై ఒక వైపు వాలి కిందకు వేలాడుతున్న టార్పలిన్ పట్టాలను తొలగించారు. వ్యాగన్‌లో ఉన్న సరుకు వర్షానికి తడవకుండా ఉండేందుకు కప్పిన టార్పాలిన్‌కు తాళ్లు సక్రమంగా కట్టకపోవడంత గాలికి జారి కిందకు వచ్చినట్లుగా నిర్ధారించారు. అదే సమయంలో స్టేషన్ సమీపంలోకి చేరుకున్న తిరుపతి - హుబ్లీ ఇంటర్‌సిటీ రైలును మూడో ప్లాట్‌ఫాంలోకి మళ్లించారు. గూడ్స్ లోకో పైలెట్ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించి ఉన్నా.. వ్యాగన్ చక్రాలకు చుట్టుకున్న టార్పాలిన్ కారణంగా పట్టాలు తప్పిపెను ప్రమాదం జరిగి ఉండేది.

యువతి ఆత్మహత్య



సురేఖ మృతదేహం

గుంతకల్లు రూరల్: మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన సురేఖ (18) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... దంచర్ల గ్రామానికి చెందిన బాలసుంకన్న, పార్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ భార్యాపిల్లలను బాలసుంకన్న పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె సురేఖ పదో తరగతి వరకు చదువుకుంది. ఆ తర్వాత చదువులకు స్వస్తి చెప్పిన ఆమె తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. గత రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్న సురేఖ గురువారం నొప్పి తీవ్రత తాళలేక అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వేరుశనగ పంటకు కాపలాకు వెళ్లిన బాలసుంకన్న శుక్రవారం తెల్లవారుజాము 4 గంటలకు ఇంటికి చేరుకుని తలుపు కొట్టిన సమయంలో కుటుంబసభ్యులు నిద్రలేచారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపిస్తూ తలుపు తీశారు. కుమార్తె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న బాలసుంకన్న సమాచారంతో గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

యువకుడి హత్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని కురాకులతోట సమీపంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని కురాకుల తోట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (29)కి భార్య వాణి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కళ్యాణదుర్గంలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న వన్నూరు స్వామి శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం పని ముగించుకుని బయటకు వచ్చిన ఆయనను పట్టణ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని దుండగులు గొంతు కోసం హతమార్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

అనంతపురం అర్బన్: రక్తదానం, తదితర సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రక్తదాతలను అభినందించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, పచ్చదనం పరిశుభ్రత వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అవైస్ హాజరి మహేష్ బాబు ఫ్యాన్ అసోసియేషన్ సభ్యులను కలెక్టర్ అభినందించారు. మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సినీ తారల అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు విజయకృష్ణ, గుర్రం దినేష్, సత్తిరెడ్డి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

రాప్తాడు: రైతులు ఒకే రకమైన పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. పంటల మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడులోని రైతు భరోసా కేంద్రంలో పంటల సాగుపై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా వేరుశనగ పంట సాగు చేసి నష్టపోతున్నారని తెలిపారు. అలా కాకుండా పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. పంట సాగు చేసే రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. రసాయన ఎరువులు వాడితే భూమిలో సారం తగ్గి పోతుందన్నారు. దీంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. అలాగే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏడీఏ శైలజా కుమారి, ఏఓ శేఖర్ రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది సోనియా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్ షాపులపై దాడి



మగ్గం షాప్ నేమ్ బోర్డులను వీధిలోకి పారవేస్తున్న మహిళలు

అనంతపురం: పశ్చిమ బెంగాల్, బీహార్ నుంచి వచ్చి అనంతపురంలో నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ, జరీ వర్క్, మగ్గం వర్క్ షాపులపై కొంత మంది మహిళలు శుక్రవారం దాడులు చేశారు. నేమ్ బోర్డులు, మగ్గం వర్క్‌లను యథేచ్ఛగా వీధుల్లోకి విసిరేశారు. తక్కువ రేటుకే లావాదేవీలు జరిపితే స్థానికులమైన మా పరిస్థితి ఏమిటని బొటిక్‌లు నిర్వహిస్తున్న మహిళలు నిలదీశారు. బిల్లు బుక్కులను చూసి మరీ రెచ్చిపోయారు. రహమత్ నగర్, రాంనగర్‌లో పదుల సంఖ్యలో బొటిక్‌లు ఉన్నాయి. అయితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పశ్చిమబెంగాల్, బీహార్ వారిపై దాడి చేసిన మహిళల ప్రవర్తనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో ఎక్కడైనా వ్యాపారం చేసుకునే హక్కు ఉన్నప్పటికీ, చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్, బీహార్‌కు చెందిన వారిపై దాడులు చేయడం సరికాదని హితవు పలుకుతున్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి

అనంతపురం కార్పొరేషన్: క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సేవలందిస్తే..రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో క్యాన్సర్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేసుకోవాలన్నారు. ఈనెల 30న నగరపాలక సంస్థలో ఉదయం 9 గంటల నుంచి ఉచిత నిర్ధారణ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు పీటీ పద్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శ్రీవల్లి, ఎస్‌ఓ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డం..!



నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో డివైడర్ల మధ్యలో ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన బోర్డులు



విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఇలా..

- వివిధ కూడళ్లలో లాలిపప్స్ ప్రకటన బోర్డుల ఏర్పాటు
- బోర్డుకు బోర్డుకు మధ్య కనిపించని వ్యత్యాసం
- టెండర్ లేకుండా ప్రకటన బోర్డుల కేటాయింపు

అనంతపురం కార్పొరేషన్: అడ్వటైజ్‌మెంట్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో అడ్డదిడ్డంగా లాలిపప్స్ బోర్డులను ఏర్పాటు చేయడం ప్రజలను కలవరపెడుతోంది. బోర్డుకు బోర్డుకు మధ్య వ్యత్యాసం లేకపోవడంతో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. వాహనదారులు వెళ్లే సమయంలో బోర్డుల వైపు చూసి ప్రమాదాలు కొనితెచ్చుకునే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఈ ప్రచార బోర్డుల ఏర్పాటుకు తక్కువ మొత్తాన్నే నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం గెజిట్ ఇవ్వడంతో వ్యాపారులకు లబ్ధి చేకూరుతోంది.

210 'లాలిపప్స్' ప్రకటనల బోర్డులు

నగరంలోని శ్రీకంఠం సర్కిల్, విద్యుత్‌నగర్, హౌసింగ్ బోర్డు, తదితర ప్రాంతాల్లో 210 లాలిపప్స్ ప్రకటన బోర్డులను ఏర్పాటు చేశారు. వాస్తవంగా బోర్డుకు మధ్య 20 అడుగల వరకు వ్యత్యాసం ఉండాలి. తద్వారా వాహనాదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఒకదానికి ఆనుకుని మరొకటి ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు వెళ్లే సమయంలో ఏకాగ్రత లోపించి, వాటి వైపు చూసే ప్రమాదం లేకపోలేదు.

నో టెండర్.. ఒక్కో బోర్డుకు రూ.2500 మాత్రమే

వాస్తవంగా ప్రచార బోర్డులకు నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బోర్డులను ఏర్పాటు చేసుకునేందుకు నాలుగు ఏజెన్సీలు నగరపాలక సంస్థకు దరఖాస్తు చేసుకున్నాయి. వాస్తవంగా టెండర్ ప్రకారం వాటిని సదరు ఏజెన్సీలకు అప్పగించాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. ఏజెన్సీ నిర్వాహకులు పాత పద్ధతుల్లోనే చలానా చెల్లించి, బోర్డులను ఏర్పాటు చేసేసుకున్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ తాత్కాలికంగా వాటికి అడ్డుకట్ట వేస్తే.. ఎంతో కొంత చెల్లిస్తామని ముందుకొచ్చారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఒక్కో బోర్డుకు రూ.2,500 (ఏడాదికి) మాత్రమే ఫిక్స్ చేశారు. ఇదీ వ్యాపారులకు వరంగా మారింది. నగరపాలక సంస్థ ఆదాయానికి మాత్రం గండి పడింది. వాస్తవంగా ఒక్కో బోర్డుకు కనీసం రూ.5,000 పైగానే చెల్లించాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి లేదు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యాపారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సక్రమంగా ఏర్పాటు చేయిస్తాం..

నగరంలోని వివిధ ప్రాంతాల్లో డివైడర్ల మధ్య వేసిన బోర్డులు అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే. ప్రతి బోర్డుకు వ్యత్యాసం ఉండాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది ప్రకటనల బోర్డులకు చెల్లించే మొత్తాన్ని డబుల్ చేస్తాం. – మారుతి హరిప్రసాద్ (డీసీపీ)

ఇంటి వద్దకే పింఛన్



మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

ఆత్మకూరు: మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు జూన్ నెల మాత్రం రూ.7 వేలు అందజేస్తారని తెలిపారు. అంతేకాకుండా 60 మంది లబ్ధిదారులకు ఒక సచివాలయ ఉద్యోగిని నియమించినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి 1వ తేది ఉదయం 6 గంటల నుంచే పింఛన్ సొమ్ము అందించాలని తెలిపారు. పింఛన్ల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు , ఇతర సిబ్బంది పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించొద్దని సూచించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే నిజమైన గుర్తింపు



పీఆర్ ఎస్‌ఈ ఈరాస్వామిని సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు



ఆర్‌ఐ పద్మలతను సన్మానిస్తున్న మేయర్ వసీం



డెమో ఉమాపతిని సన్మానించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి



ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులును సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, నిబద్ధతతో సేవలందించినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా అన్నారు. పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం పీఆర్ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా మాట్లాడుతూ.. పీఆర్ ఎస్‌ఈ ఈరాస్వామి ఎక్కడ పని చేసినా నిజాయితీగా సేవలందించాని కొనియాడారు. ఆయా ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఎస్‌ఈ పీఏలు రాజేంద్ర ప్రసాద్, చంద్రకుమార్, సూపరింటెండెంట్ గీత, డీఈ మూర్తి, ఏఈలు హుస్సేన్ బాషా, లక్ష్మీదేవి మాట్లాడారు. ఎస్‌ఈ సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీకాంత్, రాజేశ్ నాయక్, టెక్నికల్ ఆఫీసర్ కృష్ణా నాయక్, జేటీఓ నాగతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఐ పద్మలత సేవలు మరువలేనివి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా విధులు నిర్వర్తిస్తున్న పద్మలత సేవలు మరువలేనివని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆర్‌ఐ పద్మలత ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. అందులో భాగంగా శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఐ పద్మలత ఉద్యోగులకు గెట్ టూ గెదర్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ వసీం ఆమెను సన్మానించారు. నగరపాలక సంస్థలో వివిధ హోదాల్లో పద్మలత సేవలందించారని తెలిపారు. ఆమె శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఆర్‌ఓ సతీష్, ఆర్‌ఐలు మురళి, వేణు, బాబు, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, సీసీలు శ్రీకాంత్, ఉదయ్, జూనియర్ అసిస్టెంట్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయులుకు సన్మానం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులుకు సన్మాన సభ ఏర్పాటు చేసి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వడ్డుపల్లి గ్రామంలో దాదాపు 18 సంవత్సరాలుగా వడ్డుపల్లి గ్రామానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తి ఉపాధి హామి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ మేరకు శుక్రవారం రామాంజనేయులు పదవీ విరమణ పొందడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు సన్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రామాంజినేయులు పదవి విరమణ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వడ్డుపల్లిలో 18 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేశారన్నారు. అందరికీ ఉపాధి హామీ పనులు కల్పించారని తెలిపారు. రామాంజనేయులు సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఏపీఓ సుజాత వడ్డుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, ఓబిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెమో ఉమాపతి సేవలు అమూల్యం

అనంతపురం మెడికల్: డెమో ఉమాపతి సేవలు మరువలేనివని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ నెల 30న ఉమాపతి ఉద్యోగ విరమణ చేయనున్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ముందస్తు సన్మాన సభ ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గత 35 ఏళ్లుగా ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో ఉమాపతి సేవలందించారన్నారు. విధులను అంకితభావంతో నిర్వహించేవారని కొనియాడారు. శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. డెమో ఉమాపతి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అందరి సహాయ సహకారాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలందించడం ఎంతో తృప్తి ఇచ్చిందన్నారు. అనంతరం డెమో ఉమాపతి దంపతులను డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం ఆఫీసర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ, డాక్టర్ రవిశంకర్, కార్యాలయ పరిపాలనాధికారి గిరిజ మనోహర రావు, ఎస్‌ఓ మహమ్మద్ రఫి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, సూపరింటెండెంట్ విజయభాస్కర్ రెడ్డి, సురేష్, కమలాకర్ రాజు, పవన్, అసోసియేషన్ నాయకులు మాధవ, చంద్రమోహన్, లక్ష్మణ్ణ, షఫి, శ్రీధర్‌బాబు, లక్ష్మీనారాయణ, సాంబ శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు సరికొత్త సీటీ స్కాన్

- కాలం చెల్లిన మిషన్ స్థానంలో ఏర్పాటుకు చర్యలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నిర్ణయం



నూతనంగా ఏర్పాటు చేయనున్న సీటీ స్కాన్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కాలం చెల్లిన సీటీ స్కాన్ మిషన్ స్థానంలో నూతనంగా మరో సీటీ స్కాన్ మిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నూతన మిషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత ఎస్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులకు అప్పటి అధికారులు సూచించారు. ఈ క్రమంలో సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్‌లో సీమెన్ సోమోటామ్ 32 స్లైస్ మిషన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ప్రభుత్వ సర్వజనాస్పత్రికి కొత్త సీటీ స్కాన్ మిషన్ వచ్చింది. పాత సీటీ స్కాన్ మిషన్‌ను మార్చి దాని స్థానంలో కొత్త మిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. నూతన సీటీ స్కాన్ ద్వారా తక్కువ సమయంలో స్కాన్ చేసే సదుపాయం ఉంటుంది. దీంతో పాటుగా రేడియేషన్ ప్రభావం ఉండదు. గతంలో వినియోగించే సిటీ స్కాన్ మిషన్ 60 స్లైస్. కాగా సిటీ స్కాన్ సేవలకు తాత్కాలికంగా అంతరాయం కలగడంతో రోగులు అవస్థలు పడాల్సి వచ్చింది. రోగులు ఇబ్బంది పడకుండా సిటీ స్కాన్ సెంటర్ నిర్వాహకులు రాకేష్, తదితర బృందం కొంత మంది రోగులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని సిటీ స్కాన్‌లో స్కాన్ చేసేలా చూశారు. సాధ్యమైనంత త్వరగా సీటీ స్కాన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆస్పతి అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి. వాస్తవంగా రోజూ 50కి పైగా సీటీ స్కాన్‌లు జీజీహెచ్‌లో జరిగేవి.

అన్నదానం

అనంతపురం కల్చరల్: నిరుపేదల ఆకలి తీర్చడానికి అవకాశం రావడం ఆనందంగా ఉందని నిత్య సురభి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నిర్మల మురళీ అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ బాలభవన్ ఎదురుగా నిత్యసురభి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంపాదించిన దానిలో కొంత భాగం సమాజానికి అందించేలా అవగాహన కల్పిస్తూ చైతన్యం చేస్తున్నామన్నారు. పుట్టిన రోజులు, వివాహ సందర్భాల్లో హంగులు, ఆర్భాటాలకు పోకుండా పది మందికి సాయం చేయడం ద్వారా సమాజానికి తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జగన్నాథ్, రవికుమార్, మణిదీప్,లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం, ఓబులపతి, కిష్టప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 172 మందికి ఉద్యోగాలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో బెంగళూరుకు చెందిన పలు కంపెనీలు శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 172 మంది వివిధ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతపురంతో పాటు ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రిలోని ప్రభుత్వ బాలుర ఐటీఐల్లో వివిధ కోర్సులు చేస్తున్న విద్యార్థులు, పీఎంకేవీవై కోర్సు చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 600 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 172 మంది ఉద్యోగాల అర్హత లెటర్లు పొందారు. కార్యక్రమంలో టాటా స్ట్రైవ్ కోఆర్డినేటర్ మార్కండేయులు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కళ్యాణి, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సీపీఎస్ రద్దు చేస్తూ సీపీఎస్ ఉద్యోగులపై బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఫోరం ఆఫ్ రిజిష్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వెబెక్స్‌లో ఫోర్టో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ అంకాల కొండయ్య, రాష్ట్ర కో–చైర్మన్ వెంకటరెడ్డి, అధికార ప్రతినిధులు బోనెల రమేష్, మాగంటి శ్రీనివాసరావు మాట్లాడారు. ఉన్నత సమాజాన్ని నిర్మించాలంటే విద్యా వ్యవస్థలోని అన్ని వ్యవస్థలను ఒక గొడుగు కిందకు తీసుకురావాలన్నారు. పంచాయతీరాజ్ పరిధిలోని పాఠశాలలను మండల, జిల్లా పరిషత్ యాజమాన్యంలోకి, 84 జీఓ రద్దు చేసి నగర, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలను మున్సిపల్ యాజమాన్య పరిధిలోకి విలీనం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ల చెల్లింపులను చట్టబద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చే వరకూ యాజమాన్యం వారి పదోన్నతులు కల్పించాలన్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు జరగాలన్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. పటిష్టమైన విద్య, నాణ్యమైన విద్యాబోధనకు ఉపాధ్యాయులకు అదనపు విధుల నుంచి తప్పించాలని కోరారు. ప్లస్–2 పాఠశాలలను ప్రజా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వసంతరావు, శేష ఫణి, కేశినేని ప్రభాకర్ రావు, గోపాలప్ప, దొడ్డా ఉమామహేశ్వరరావు, కుమార్, అమర్నాథ్, ఆదిశేషయ్య, వేణుగోపాల్, ఏపీ సిపిఎస్ రామన్న పాల్గొన్నారు.



చిన్నపిల్లల వార్డులో మూలకు పడేసిన పాత మంచాలు

జీజీహెచ్‌లో అధ్వాన్నం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులోని ఐసొలేషన్ యూనిట్ ఆనుకుని ఉన్న గదిలో పాత మంచాలను మూలకు పడేశారు. దీంతో పాటు తప్పుపట్టిన స్ట్రెచర్లు, తదితర సామాగ్రిని అక్కడ వేయడంతో అధ్వాన్నంగా కన్పిస్తున్నాయి. వాస్తవంగా పనికి రాని వస్తువులను ఆస్పత్రి వెనుకవైపు, లేని పక్షంలో వాటిని మరమ్మతు చేయించాల్సి ఉంది. కాగా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. ఆర్‌ఎంఓలు వార్డులను నిశితంగా పరిశీలించి, సురక్షిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– అనంతపురం కార్పొరేషన్:

ఆర్టీసీ ప్రాంగణం.. సమస్యల నిలయం

జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. జిల్లాలో అన్ని డిపోల కన్నా అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆదర్శంగా ఉండాలి. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడా శుభ్రత పాటించడం లేదు. 24 గంటలు రద్దీతో కిటకిటలాడే బస్టాండ్ కుక్కలకు ఆవాసంగా మారిపోయింది. ప్రయాణికులు సేద దీరాల్సిన చోట కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. హోటళ్ల వద్ద మిగిలిపోయిన ఆహార పదార్థాలు తినేందుకు అలవాటు పడిన కుక్కలు బస్టాండ్‌ను వదిలి వెళ్లడం లేదు. కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయో అని ప్రయాణికులు భయపడుతున్నారు. హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను ఇష్టారాజ్యంగా వదిలేయడంతో బస్టాండ్‌లోని ప్లాట్ ఫాంలలో అపరిశుభ్రత నెలకొంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వీల్ చైర్‌లను మూలన పడేశారు. వికలాంగులు, వృద్ధులు నడవలేని వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో కుక్కల బెడద లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. హోటళ్ల నిర్వాహకులు తినుబండారాలు బయట పడేయకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– అనంతపురం క్రైం:







ఆర్టీసీ బస్టాండ్‌లో సేదతీరుతున్న కుక్క, ఓ మూలన పడేసిన వీల్‌చైర్, ప్లాట్ ఫాంలో అపరిశుభ్రత నెలకొన్న దృశ్యం

డయేరియా వ్యాప్తిని అరికడదాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: డయేరియా వ్యాప్తిని అరికడదాం. అతిసారంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం రాప్తాడు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్–1, చిన్మయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్–2 అంగన్‌వాడీ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడి చనిపోకూడదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అతిసారం వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వీటిని డయేరియా బాధితులకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని కోరారు. బయటి ఆహార పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకోవడంతో పాటు పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రతపై అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు చుట్టపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట రూములను ఆయాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.